క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీతను ప్రచారం చేస్తున్న దృశ్యం

కల్లూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కల్లూరు, కర్నూలు కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, అంబేడ్కర్‌రోడ్డు, పెద్దపాడు గ్రామంలో భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు, కర్నూలు కమిటీ అధ్యక్షులు, సభ్యులు పురుషోత్తం, నాగయ్య, శివ, గంగాధర్, ఓబులేసు, ఈశ్వరయ్య, అక్షిత్, మౌనిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అమావాస్య పూజలు



అలంకరణలో వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అమావాస్య పూజలు చేపట్టిన అనంతరం రుద్రాభిషేకం, మహామంగళహారతి, గణపతి పూజ, ఇతర పూజలు చేపట్టారు. అనంతరం స్వామి వారికి నైవేద్య సమర్పణ, ఏకాంత సేవ తదితర కైంకర్యాలు నిర్వహించారు.

లారీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు

కోడుమూరు రూరల్: కోడుమూరులో అనారోగ్యంతో మృతిచెందిన లారీ డ్రైవర్ కుటుంబానికి తోటి డ్రైవర్లు, క్లీనర్లు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కోడుమూరుకు చెందిన బోయ శ్రీనివాసులు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తోటి డ్రైవర్లు, క్లీనర్లు ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి చిన్న రాముడు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రూ.21వేలను కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్, గడ్డం నాగరాజు, వాసు, అశోక్, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలు అందించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

కార్యసిద్ధి ఆంజనేయుడికి సింధూరార్చన

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి నవగ్రహ, లక్ష్మీగణపతి మూల మంత్ర సహిత చండీహోమం, అర్చనలు, అభిషేకాలు, సింధూరార్చన తదితర పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

దేశ సమైక్యతపై కవితలు రావాలి

కర్నూలు కల్చరల్: దేశ సమైక్యతపై కవితలు రావాల్సిన అవసరం ఉందని టీజీ వెంకటేష్ అన్నారు. ప్రముఖ కవి గద్వాల ఈరన్న రచించిన 'కవిగూర గంప' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో, దేశ సమైక్యత, మత సామరస్యం, శాంతి అంశాలపై కవులు రచనలు చేయాలన్నారు. సాహితీ వేత్త గోరెడ్డి హరిశ్చంద్రారెడ్డి పుస్తక సమీక్ష చేశారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కవులు జ్యోతిర్మయి, రామకృష్ణ, ముద్రిక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనర్థం.. పంట వ్యర్థాల దహనం

- పంటల అవశేషాలను కాల్చివేస్తున్న రైతులు
- సారం కోల్పోతున్న భూమి
- అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం



గార్గేయపురం సమీపంలోని పొలంలో పంట వ్యర్థాలకు నిప్పుపెట్టిన దృశ్యం

కర్నూలు(రూరల్): ఖరీఫ్, రబీ సాగు ఏదైపా పంట పూర్తయిన తర్వాత పంట అవశేషాలను దహనం చేయడం రైతులకు అలవాటుగా మారింది. ఇలా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడంతో పాటు భూమిలో అనేక మార్పులు జరిగి భూమి సారం కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా పంటల దిగుబడులు తగ్గిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీనికి బదులుగా ఈ అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల భూమి సారం పెరిగి తదుపరి పంటలో అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

కోడుమూరు నియోజకవర్గంలో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న, పొగాకు, మిరప, కంది, ఆముదం పంటలు సాగు చేస్తుంటారు. సుమారు 90 శాతం మంది రైతులు గత పంటల అవశేషాలను కాల్చివేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఖరీఫ్ వరి, పత్తి పంటలు పూర్తి కావడంతో ఈ రెండు పంటల అవశేషాలను యథేచ్ఛగా దహనం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు గతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. సి.బెళగల్, గూడూరు, కోడుమూరు, కర్నూలు కలిపి 60 వేల హెక్టార్లలో ఖరీఫ్, రబీ సిజన్ల సాగు ప్రస్తుతం పూర్తయింది. కొంతమేర రబీలో వరి, మొక్కజొన్న, కొర్ర, మినుము సాగు చేయగా మిగిలిన రైతులు పంటల అవశేషాలను సాగు భూముల్లోనే కాల్చివేసి వచ్చే ఏడాది ఖరీఫ్ పంటకు భూమిని సిద్ధం చేసుకుంటున్నారు.

కలియదున్నితే మేలు..

పంటల అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పూర్వం రైతులు పంట అవశేషాలను భూమిలో కలియదున్నే వారు. దీని ఫలితంగా అవి కుళ్లిపోయి తర్వాతి పంటలకు మంచి ఎరువుగా మారేవి. కాలక్రమేణ రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి పొలంలోనే తగలబెట్టడం అలవాటుగా మార్చుకున్నారు. దీని వల్ల రైతులకు తెలియకుండానే భూమికి అనేక విధాల నష్టం కలుగుతోంది. నిప్పు పెట్టడం వల్ల తర్వాత సాగు చేయబోయే పంటలకు నష్టం వాటిల్లడమే కాకుండా వాతావరణ కాలుష్యం, అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఇటీవల ఈ తరహా ఘటనలు అధికమవుతున్నాయి.

పంటల అవశేషాలను కాల్చడం వల్ల తలెత్తే అనర్థాలు

- నెల స్వాభివిక లక్షణాలు మారిపోతాయి.
- భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది.
- భూసారం తగ్గి పరోక్షంగా దిగుబడులపై ప్రభావం.
- నేలలో తేమ శాతం గణనీయంగా తగ్గుతుంది.
- నేలలో ఆమ్ల గుణం తగ్గిపోతుంది.
- పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.
- అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తుంది. ఫలితంగా నేల సమతుల్యత దెబ్బ తింటుంది.
- భూమి పొరల్లో పంటకు, నెలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోతాయి.

కలియదున్నడం ఉత్తమం



పంటల అవశేషాలను రైతులు భూమిలో కలియ దున్నాలి. అవశేషాలు కుళ్లిపోయి ఆ తర్వాత సాగు చేసే పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుల వల్ల భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి. దీని వల్ల ఎరువుల వాడకం, పెట్టుబడులు తగ్గుతాయి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

–రూఫస్ రోనాల్డ్, వ్యవసాయాధికారి, కర్నూలు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దంత వైద్యుడి కుటుంబానికి చేయూత

కర్నూలు(హాస్పిటల్): అనంతపురంలో ఇటీవల ఆకస్మిక మరణం చెందిన డాక్టర్ ఏ.మధు కుటుంబానికి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చేయూతనందించారు. ఆదివారం అసోసియేషన్ నాయకులు అనంతపురంలోని డాక్టర్ మధు ఇంటికి వెళ్లి ఆయన భార్య డాక్టర్ సుష్మా కౌముదికి ఫ్యామిలి బెనిఫిట్ స్కీమ్ కింద రూ.15.65 లక్షలు అందజేశారు. ఐడీఏకు డాక్టర్ మధు అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి అజయ్‌బెనర్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కిశోర్‌కుమార్, ఐడీఏ రాయలసీమ కర్నూలు శాఖ కార్యదర్శి ఆర్.రామచంద్రారెడ్డి, ట్రెజరర్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు

గడివేముల: గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల పరిధిలోని గని జెడ్పీ పాఠశాలలో జరిగింది. కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒక్కసారిగా కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అందరూ ఒక్కచోట కూర్చొని భోజనం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగరాజు, శేషాచలం, ఉమ్లానాయక్, సాంబశివుడు, జనార్దన్‌రెడ్డి, రవికుమార్, సత్యనారాయణ, హృదయరాజులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు బస్టాండు నుంచి స్కూల్ వరకు ర్యాలీగా వచ్చారు.

ఉరుముల, మెరుపుల వర్షం



పాణ్యంలో కమ్ముకున్న మేఘాలు

పాణ్యం : ఉదయం నుంచి ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేయగా.. సాయంత్రం వాతావరణంలో మార్పులు రావడంతో ఒక్కసారిగా మెరుపులు, ఉరుములతో వర్షం ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం నుంచి ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. 6.30 గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు వర్షం ఆగి.. ఆగి కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. అయితే ఆకాల వర్షం కారణంగా అరటి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలుల ధాటికి చెట్లు నెలకొరిగిపోగా.. పలుచోట్ల కల్లాల్లో ఆరబెట్టుకున్న మిరప దిగుబడులు తడిసిపోయాయి. తడిసిన దిగుబడిని కాపాడుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేసిన వర్షానికి తడిసిపోయినట్లు రైతులు వాపోయారు.

ఉగ్రదాడి బాధితులకు నివాళి



పాణ్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

పాణ్యం : కశ్మీర్ ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకురాలని కోరుతూ పాణ్యంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. బస్టాండ్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి కొవ్వొత్తులతో శాంతిర్యాలీ చేపట్టారు. పాణ్యం బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అక్కడి నుంచి పాణ్యం నాలుగు రోడ్ల కూడలి చేరుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు నాగరాజు, శంకరయ్య, సిమెంట్ శ్రీనివాసులు, జనార్దన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సీతక్క, సుధీకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీపీలను బాధ్యులు చేయడం తగదు



మాట్లాడుతున్న చిన్ని ప్రసన్న

కర్నూలు (టౌన్): భవనాల అనుమతుల విషయంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ఎల్‌టీపీలు (లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్) కీలకంగా వ్యవహరిస్తున్నారని, అయితే యజమానులు చేసే తప్పులను తమపై మోపడం అన్యాయమని కర్నూలు లైసెన్సుడ్ ఇంజినీర్ల సంఘం చైర్మన్ చిన్ని ప్రసన్న అన్నారు. స్థానిక పాతబస్టాండ్‌లోని స్కంద కాంప్లెక్స్‌లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో భవనాల అనుమతులను సులభతరం చేసేందుకు జీఓ 20 జారీ చేశారన్నారు. ఈ జీఓలో ఎల్‌టీపీల విషయంలో ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్లాన్ అప్రూవల్ తీసుకున్న భవన యజమాని డీవియేషన్‌కు పాల్పడితే అందుకు తమను బాధ్యులు చేసి ఐదేళ్ల పాటు లైసెన్సు రద్దు చేయడం, చట్టపరంగా చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేటు వ్యక్తులుగా ప్లాన్ అప్రూవల్ వరకు తమ పని ఉంటుందని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టారా.. లేదా అన్న విషయాన్ని సంబంధిత సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. యజమానులు చేసే అక్రమాలను తమపై రుద్దడం ఏంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం జీఓలో పొందుపరచిన ఎల్‌టీపీల విషయంలో సవరణలు చేయాలన్నారు. అసోసియేషన్ వైస్ చైర్మన్ నాసీర్‌ఖాన్, కార్యదర్శి శాలు హమీద్, నిర్వహణ కార్యదర్శి కామేష్ గౌడ్, ఎజాస్ అహమ్మద్, రఫీయుద్దీన్, ముస్తాక్ పాల్గొన్నారు.

విద్యను ప్రైవేటీకరించే కుట్ర

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు విద్యను ప్రైవేటుపరం చేసి వ్యాపారంగా మారుస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ విమర్శించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరుగుతున్న జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్యా వ్యవస్థను పరిరక్షించుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలన్నారు.

ముగిసిన తిమ్మగురుడు తిరునాల

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



నృత్యం చేసిన చిన్నారులను అభినందిస్తున్న మాజీ జెడ్పీటీసీ

కోడుమూరు రూరల్: గూడూరులో వెలసిన శ్రీతిమ్మగురుడు స్వామి తిరునాల ఆదివారం వసంతోత్సవంతో ముగిశాయి. వారం రోజుల పాటు జరిగిన తిరునాలలో శ్రీతిమ్మగురుడు స్వామికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాలను పురస్కరించుకుని చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు చైతన్య యూత్ సభ్యులతో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. అలాగే పదో తరగతి ఫలితాల్లో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులను చైతన్య యూత్ సభ్యులు మెమొంటోలతో సత్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు దస్తగిరి, బజారి, విజయుడు, చైతన్య యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు క్రిష్ణ, మనోహర్, రామయ్య, రమేష్, ఉగ్ర నరసింహులు, మద్ది లేటి, వెంకటేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు డి.అబ్దుల్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివారం గడియారం ఆసుపత్రి అడ్డాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు రుణాలు ఇవ్వాలని, పిల్లల చదువులకు సహకారం అందించాలని కోరారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్.ఖాజాపాషా, జి.ఏసు, డి.అబ్దుల్లా బతుకన్న పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనతో మానసిక ప్రశాంతత



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, శుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇస్కాన్ ప్రవచకులు హీరాలాల్ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. హీరాలాల్ ప్రభు మాట్లాడుతూ నిత్యం భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ జీవిత గమనానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

మొక్కజొన్న పంటలపై పందుల దాడులు



సి.బెళగల్‌లో మొక్కజొన్న తోటలో స్వైర విహారం చేస్తున్న పందులు



ధ్వంసమైన పంటను చూపుతున్న బాధిత రైతు వెంకటేష్



పందులు తిన్న మొక్కజొన్న పొత్తు

సి.బెళగల్: మండలంలోని పంట పొలాల్లో పందులు స్వైర విహారం చేస్తూ పంటకు నష్టం కలిగిస్తున్నాయి. వరి, మొక్కజొన్న, కంది, వేరుశనగ, కొర్ర తదితర పంటలపై దాడు చేస్తూ నాశనం చేస్తున్నాయి. చేతికి వచ్చిన ధాన్యంను సైతం పందులు తినడంతో రైతులు నష్టపోతున్నారు. పొలాల్లో పందుల సమస్యను రైతులు పందుల యజమానులకు దృష్టికి తీసుకెళ్లినా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సి.బెళగల్ శివారులోని మొక్కజొన్న, వరి పొలాల్లో పందులు దాడులు చేయడంతో బాధిత రైతులు ఉడుముల వెంకటేష్, శంకరన్న తదితరులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పందుల యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

చింత చిగురుతో ఉపాధి



చింత చిగురు కోస్తున్న దృశ్యాలు



చింత చిగురు



కల్లూరు: వేసవి కాలం ప్రారంభమవ్వడంతో మార్కెట్‌లోకి మామిడి పండ్లతో పాటు చింత చిగురు కూడా వచ్చేససింది. చింతచిగురు ఎక్కువగా ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న కాలంలో (వేసవి కాలం)లో విరివిగా లభిస్తుంది. చాలా మంది చింత చిగురు రుచిని ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతారు. పప్పు, చట్నీతో పాటు చికెన్‌లో చింత చిగురు వేసి వండి తింటారు. ఆరోగ్య పరంగా కూడా మేలు చేస్తుండటంతో చిగురుతో చేసిన ఆహార పదార్థాలను చాలా మంది ఇష్ట పడతారు. దీంతో మార్కెట్‌లో చిగురుకు డిమాండ్ ఉండటంతో గ్రామీణ ప్రాంతాల మహిళలు, యువకులు చింత చిగురు సేకరణను ఉపాధిగా మార్చుకుంటున్నారు. ఎత్తైన చెట్లను సులువుగా ఎక్కి చిగురు కోసుకుని పట్టణాలో విక్రయిస్తున్నారు. సేకరించిన చిగురును రైతుబజార్, ప్రధాన కూడలలో కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. కుప్ప సైజును బట్టి రూ.10, రూ.20 చొప్పున విక్రయించి ఆదాయం పొందుతున్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార కల్తీ నియంత్రణ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని పలు హోటళ్లలో ఆదివారం ఆహార కల్తీ నియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్‌తో పాటు కేంద్ర ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ మిశ్రా కలిసి గుత్తిరోడ్డులోని పిస్తా హోటల్, ఓటీజీ హోటల్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు ఆహార పదార్థాలు ఉన్నాయా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అని పరిశీలించారు. ఆయా హోటళ్లలో కిచెన్‌రూమ్, స్టోరేజీ రూమ్, డైనింగ్ హాల్, ఆహార తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాల్లో కాలపరిమితి తీరినవి ఉన్నాయేమోనని చూశారు. హోటల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నారా, వంట చేసేవారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. తాగునీటిని పరిశీలించి సంతృప్తి చెందారు. జీఎస్టీ చెల్లిస్తున్నారా, ఫుడ్ లైసెన్స్ తీసుకున్నారా అని పరిశీలించారు. హోటల్‌లకు వచ్చిన వినియోగదారుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయా హోటళ్లకు సంబంధించి రేటింగ్ ఇచ్చేందుకు తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.